సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 28 । డిసెంబర్ । 2024



ఎయిర్‌పోర్టుకు భూములివ్వలేం

పోలవరం కాలువ, పుష్కర పథకం, హైవేలకు ఇప్పటికే భూములిచ్చిన తాము ఉన్న కాస్త పొలాలను ఎయిర్‌పోర్టుకు ఇచ్చి నష్టపోలేమని రైతులు స్పష్టం చేశారు.


8లో



పిఠాపురంలో ఫ్లెక్సీల రగడ

పిఠాపురం పట్టణంలో పలుచోట్ల జనసేన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది శుక్రవారం తొలగించడం కూటమి పార్టీల మధ్య రగడకు కారణమైంది.

డెల్టా కాలువలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 9,745 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. దీనిలో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేలు చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.70 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

ఏఓ సస్పెన్షన్ రద్దు

సీతానగరం: గత నెలలో సస్పెన్షన్‌కు గురైన మండల వ్యవసాయ అధికారి (ఏఓ) కె.సూర్య రమేష్ శుక్రవారం తిరిగి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయనను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గత నెల 26న సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేయడంతో సూర్యరమేష్ తిరిగి మండల వ్యవసాయశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టారు.

మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలి



సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాజమహేంద్రవరంలోని సుబ్రహ్మణ్య మైదానంలో శుక్రవారం జరిగిన సీపీఐ శత వసంతల వేడుక సభలో ఆయన ప్రసంగించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 31న రాష్ట్రవ్యాప్తంగా 100వ ఆవిర్భావ సభలు జరుగుతాయని తెలిపారు. నాటి బ్రిటిష్ వలసవాద దోపిడీకి, నేటి మతవాద పరిపాలనకు వ్యతిరేకంగా సీపీఐ పోరాడుతుందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ పుత్రిక అని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను రాజ్యసభలో అమిత్‌షా అవమానించినప్పటికి బీజేపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవినీతి కుంభకోణంలో ముఖ్య పాత్రధారిగా ఉన్న విశాఖ డెయిరీ చైర్మన్‌కు పురందేశ్వరి బీజేపీ కండువా కప్పి, నీతిమంతుడిగా చేసిందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 5 నెలల్లో రూ.15 వేల కోట్ల విద్యుత్ భారాలను ప్రజలపై వేసిందన్నారు. అనకాపల్లిలో ఉన్న మిట్టల్ సంస్థకు క్యాపిటల్ మైన్స్ కావాలని చంద్రబాబు అడిగారని, విశాఖ స్టీల్ పరిశ్రమను ప్రైవేటీకరించడమే ఆయన ఉద్దేశమని విమర్శించారు. 32 మంది ప్రాణ త్యాగాలతో విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పడిందని, విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అని రామకృష్ణ అన్నారు.

పాదగయకు రూ.24.45 లక్షల ఆదాయం

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో శుక్రవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం 72 రోజులకు గానూ రూ.24,45,110 నగదు, 12.550 గ్రాముల బంగారం, 1.150 గ్రాముల వెండి వచ్చాయని దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆభరణాల తనిఖీ అధికారి, సహాయ కమిషనర్ వి.వక్లంరాజు తెలిపారు. కాకినాడ డివిజన్ తనిఖీ అధికారి ఫణికుమార్, పోలీసు, రెవెన్యూ శాఖల పర్యవేక్షణలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, సేవా సంఘాల భక్తులు హుండీల ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్, కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం ఈఓ జగన్‌మోహన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్దుపోటుపై పోరుబాట

- విద్యుత్ చార్జీల పెంపుపై ఉద్యమించిన వైఎస్సార్ సీపీ
- జిల్లా వ్యాప్తంగా నిరసనలు, బైక్ ర్యాలీలు
- విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాల సమర్పణ
- పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్



రాజానగరంలో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



రాజమహేంద్రవరంలో కోటిపల్లి బస్టాండ్ నుంచి బైక్ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు తదితరులు

సాక్షి, రాజమహేంద్రవరం: పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే ఉపసంహరించాలనే డిమాండుతో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన 'పోరుబాట' కార్యక్రమం విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా మాజీ మంత్రులు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. బైక్ ర్యాలీలు, రాస్తారోకోలతో ప్రభుత్వ తీరును ఎండగట్టారు. 'బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీ' అంటూ నినాదాలు చేశారు. అధికారంలోకి వచ్చిన 7 నెలల కాలంలోనే ప్రజలపై భారం వేయడంపై మండిపడ్డారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలకు నాంది పలుకుతామని హెచ్చరించారు. అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచబోనని నమ్మబలికిన చంద్రబాబు అండ్ కో.. గద్దెనెక్కాక విద్యుత్ చార్జీలు పెంచి నయవంచనకు పాల్పడ్డారని దుయ్యబట్టారు.

- పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యాన రాజమహేంద్రవరం రూరల్‌లోని కోటిపల్లి బస్టాండ్ నుంచి గోదావరి గట్టున ఉన్న ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న ఆందోళనకారులు విద్యుత్ పోరుబాట పోస్టర్లు చేత పట్టుకుని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మరోసారి మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు.
- ఎన్నికల ముందు నాణ్యమైన విద్యుత్ ఇస్తానని, విద్యుత్ చార్జీలు పెంచబోనని చెప్పిన సీఎం చంద్రబాబు.. ఇప్పుడు ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపడం దారుణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం వద్ద నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. గతంలో విద్యుత్ చార్జీలు పెంచడంపై ప్రశ్నించిన ప్రజలపై కాల్పులు జరిపించి, ముగ్గురు ప్రాణాలు కోల్పోయేందుకు చంద్రబాబు కారకులయ్యారని విమర్శించారు. నాటి దురంతాన్ని ప్రజలు ఇంకా మరచిపోలేదని అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను బేషరతుగా తగ్గించాలని డిమాండ్ చేశారు. పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



గోపాలపురంలో ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత



నిడదవోలు ఆందోళనలో పాల్గొన్న పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యాన రాజానగరంలోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఈపీడీసీఎల్ ఏఈ కార్యాలయానికి చేరుకుని, బైఠాయించి, సీఎం చంద్రబాబుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజా మాట్లాడుతూ, బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీ అని విమర్శించారు. వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించి, సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఏఈకి వినతిపత్రం అందజేశారు.
- నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనపర్తి నుంచి దుప్పలపూడి గ్రామంలోని సబ్ స్టేషన్ వరకూ ర్యాలీగా వెళ్లి, అధికారులకు వినతి పత్రం అందజేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలకు నాంది పలుకుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.
- పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆధ్వర్యాన నిడదవోలులో బైక్ ర్యాలీ నిర్వహించారు. చాగల్లు రోడ్డులోని విద్యుత్ కార్యాలయానికి చేరుకుని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. డాక్టర్ గూడూరి మాట్లాడుతూ, ప్రజలు బుద్ధి చెప్పక ముందే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు.
- మాజీ హోం మంత్రి, పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తానేటి వనిత ఆధ్వర్యాన నియోజకవర్గ కేంద్రంలో ఆందోళన నిర్వహించారు. ప్లకార్డులు చేత పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీగా వెళ్లి విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని వనిత హెచ్చరించారు.
- పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం నిర్వహించారు. కొవ్వూరు విజయ విహార్ సెంటర్ నుంచి ఈపీడీసీఎల్ ఏడీఈ కార్యాలయం వరకూ పార్టీ శ్రేణులతో కలిసి తలారి ర్యాలీగా వెళ్లారు. అక్కడ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఏడీఈకి వినతిపత్రం సమర్పించారు.



రాజమహేంద్రవరంలోని ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, గూడూరి శ్రీనివాస్ తదితరులు



అనపర్తిలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పార్టీ శ్రేణులు



కొవ్వూరులో పోరుబాట నిరసన ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేత తలారి వెంకట్రావు తదితరులు

ప్రతి నర్సరీ ప్రయోగశాలే.. ప్రతి రైతూ శాస్త్రవేత్తే..



కర్ణాటక హార్టికల్చర్ డీడీ విశ్వనాథశర్మకు స్వాగతం పలుకుతున్న నర్సరీ రైతులు

కడియం: మండలంలోని ప్రతి నర్సరీ ఓ ప్రయోగశాలేనని, ప్రతి రైతూ ఓ శాస్త్రవేత్తేనని కర్ణాటక రాష్ట్ర హార్టికల్చర్ డీడీ విశ్వనాథశర్మ అన్నారు. కర్ణాటకలోని పలు జిల్లాలకు చెందిన 25 మంది ఉద్యానవన శాఖ అధికారులు మండలంలోని కొత్త మొక్కల ఉత్పత్తి కేంద్రాలైన శ్రీసత్యదేవ, పల్ల వెంకన్న, శ్రీసత్యనారాయణ, శ్రీ వెంకట శ్రీనివాస, శ్రీగౌతమి నర్సరీలను సందర్శించారు. కొత్తగా రూపు దిద్దుకుంటున్న పలు రకాల మొక్కలను శ్రీ దుర్గా నర్సరీ అధినేత పెద్దిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరిశీలించారు. నర్సరీ రైతులు రూపొందిస్తున్న ఆయా మొక్కల ఉపయోగాలను, వాటి శాస్త్రీయ నామాలను కర్ణాటక అధికారులు అడిగి తెలుసుకున్నారు. వివిధ పండ్ల జాతి మొక్కలతో పాటు సప్త వర్ణాల దళాలు, పుష్పాలతో చూపరులకు కనువిందు చేస్తున్న మొక్కలను పరిశీలించి, ఇక్కడి నర్సరీ రైతుల విజ్ఞానాన్ని కర్ణాటక అధికారులు అభినందించారు. అనంతరం కడియపులంక అంతర్రాష్ట్ర పూల మార్కెట్‌ను పరిశీలించి, విధివిధానాలపై యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక అధికారులకు పుల్లా పెద్ద సత్యనారాయణ, గంగుమళ్ళ సత్యనారాయణ, పల్లా సత్తిబాబు, మల్లు పోలరాజు, మార్గాని సత్యనారాయణ, చిలుకూరి త్రిమూర్తులు, మార్గాని వీరబాబు, పాతంశెట్టి బాబ్జీ, పాతంశెట్టి బూరయ్య, రైతులు మొక్కల విశిష్టతను వివరించారు.

రుణాలివ్వకుంటే డిపాజిట్ల ఉపసంహరణ

- బ్యాంకర్లకు కలెక్టర్ వార్నింగ్
- ఉదారంగా వ్యవహరించాలని సూచన
- నెల రోజుల్లో మార్పు రాకుంటే తదుపరి కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలకు నిర్దేశిత లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వకుంటే ఆయా బ్యాంకుల్లో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేసిన డిపాజిట్లను ఉపసంహరిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. అల్పాదాయ వర్గాలకు, స్వయం సహాయక సంఘాలకు, కౌలు రైతులకు, ప్రభుత్వ ప్రాధాన్య రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్లు ఉదారంగా వ్యవహరించాలని సూచించారు. నెల రోజులు గడువు ఇస్తున్నామని, అప్పటికీ రుణ లక్ష్యాలు సాధించకుంటే ఆయా బ్యాంకుల ప్రగతి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. బ్యాంకర్లతో కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి సమీక్షా కమిటీ, జిల్లా కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ) సమావేశాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. త్రైమాసిక ప్రణాళిక అమలు పురోగతితో పాటు వివిధ పథకాలకు బ్యాంకు రుణాల మంజూరుపై చర్చించారు. డీసీసీబీ, యూకో, కోటక్ తదితర బ్యాంకుల లక్ష్య సాధనలో వెనుకబాటుపై కలెక్టర్ ప్రశాంతి వివరణ కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఖరీఫ్ రుణ ప్రణాళికలో భాగంగా జిల్లాలో రూ.6,984 కోట్లకు గాను రూ.3,549 కోట్ల స్వల్పకాలిక రుణాలు, రూ.3,323 కోట్లకు గాను రూ.2,053 కోట్ల టర్మ్ రుణాలు మంజూరు చేశారని తెలిపారు. మొత్తం స్వల్పకాలిక, టర్మ్ రుణాల లక్ష్యం రూ.11,106 కోట్లు కాగా, రూ.7,201 కోట్లు మాత్రమే మంజూరు చేశారని వివరించారు. జిల్లాలో 1,08,464 మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు జారీ చేశామని, ఇప్పటి వరకూ సుమారు 30,179 మందికి రూ.150.05 కోట్ల మేర రుణాలు అందజేశారని వివరించారు. జిల్లాలో 20,515 స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.1,421.56 కోట్ల మేర రుణాలివ్వాలన్నది లక్ష్యం కాగా, 9,478 గ్రూపులకు రూ.592.99 కోట్లు మంజూరు చేశారన్నారు. రొయ్యల సాగుపై నాబార్డు ఆధ్వర్యాన ఈ నెల 30న రాజమహేంద్రవరంలో ఉభయ గోదావరి జిల్లాల ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీసీసీ కన్వీనర్, డీజీఎం ఎ.విశ్వేశ్వరరావు, నాబార్డు ఏజీఎం వైఎస్ నాయుడు, ఆర్‌బీఐ ప్రతినిధి సీహెచ్ సవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి పెళ్లికూతుళ్లు



విరిసీ విరియని.. తెలిసీ తెలియని వయస్సులోనే పసిమొగ్గలకు 'మాంగల్యం తంతునానేనా..' అంటున్నారు.. యుక్త వయస్సు రాకుండానే తాళిబొట్టు మెడలో వేయించేస్తున్నారు.. కొద్ది నెలలకే తల్లులవుతున్న ఆ అమ్మాయిలు రకరకాల అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు.. అవగాహనా రాహిత్యమో.. గుండెల మీద కుంపటి దింపేసుకోవాలనే అమాయకత్వమో తెలీదు కానీ.. రాజానగరం మండలంలోని పలు గ్రామాల్లో తరచుగా జరుగుతున్న బాల్య వివాహాలు కలవరపెడుతున్నాయి.

- కలకలం రేపుతున్న బాల్య వివాహాలు
- అమలుకు నోచని చట్టం
- గ్రామ కమిటీల ప్రేక్షక పాత్ర



ఇన్‌స్టాగ్రామ్‌లో దర్శనమిస్తున్న కొత్త తుంగపాడు బాల్య వివాహ దృశ్యం (ఫైల్)



రాజానగరం: యుక్త వయస్సు రాకుండా బాల్య దశలోనే వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరం, అయినప్పటికీ వీటిని నిరోధించడంలో తరచూ అధికార యంత్రాంగం విఫలమవుతూనే ఉంది. బాల్య వివాహాలను నిరోధించేందుకు ప్రభుత్వాలు చేస్తున్న చట్టాలు, తీసుకుంటున్న చర్యలు ప్రకటనలకే పరిమితమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజానగరం మండలంలోని పలు గ్రామాల్లో తరచుగా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న బాల్య వివాహాలే దీనికి సాక్షిగా నిలుస్తున్నాయి. మండలంలోని భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, కొత్తతుంగపాడు, పాతతుంగపాడు తదితర గ్రామాల్లో తరచుగా బాల్య వివాహాలు జరుగుతున్నాయి. అవగాహన లేకనో.. ఓ పనైపోతుందనే ఉద్దేశమో కానీ.. యుక్త వయస్సు రాకుండానే కొంత మంది తల్లిదండ్రులు ఆడపిల్లలకు వివాహాలు చేసి, అత్తారిళ్లకు పంపించేస్తున్నారు. వీటిని అరికట్టేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు.

గుట్టు చప్పుడు కాకుండా..

కొత్త తుంగపాడు గ్రామానికి చెందిన 25 ఏళ్ల యువకుడు దొడ్డ మణికంఠ, 16 సంవత్సరాల బాలిక పక్కపక్క ఇళ్లల్లో ఉంటున్నారు. వరుడు రోజువారీ పనులు చేస్తుండగా.. వధువును ఆమె తల్లిదండ్రులు 9వ తరగతి వరకూ చదివించి, మాన్పించేశారు. ఇంటి వద్దనే ఉంటున్న ఆ బాలికతో ఆ యువకుడికి ఏర్పడిన పరిచయం కాస్తా పెళ్లి వరకూ వెళ్లింది. వారి వివాహానికి బాలిక తల్లిదండ్రులు తొలుత అంగీకరించలేదు. అయితే, అతడు లేకపోతే తాను బతకలేనంటూ ఆ బాలిక తరచూ అతడి ఇంటికి వెళ్లి వస్తుండేది. ఈ నేపథ్యంలో ఇరువైపుల పెద్దలు అయిష్టంగానే వారిద్దరికీ గుట్టు చప్పుడు కాకుండా బుధవారం రాత్రి ముక్కినాడ గ్రామంలోని దేవాలయంలో సంప్రదాయం ప్రకారం వివాహం జరిపించారు. ఆపై వారిద్దరినీ తిరుపతి పంపించేశారు. అధికారులకు తెలియకుండా ఇరు వర్గాల పెద్దలు ఈ వివాహం జరిపించినా.. సంబంధిత వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో బాల్య వివాహం గుట్టు రట్టయింది.

గతంలోనూ..

- మండలంలోని పలు గ్రామాల్లో గతంలో కూడా ఇదేవిధంగా బాల్య వివాహాలు జరిగాయి.
- పుణ్యక్షేత్రం గ్రామంలో గత ఏడాది అధికారులను బురిడీ కొట్టించి మరీ ఇరు వర్గాల పెద్దలకు బాల్య వివాహం జరిపించేందుకు ప్రయత్నించారు. దీనిపై స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తల నుంచి సమాచారం అందుకున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారులు వెంటనే పోలీసులతో కలిసి ఆ గ్రామానికి చేరుకుని, బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. యుక్త వయస్సు రాకుండా పిల్లలకు వివాహం చేయబోమంటూ పెద్దల నుంచి రాతపూర్వకంగా హామీ కూడా తీసుకున్నారు. అంతటితో తమ డ్యూటీ అయిపోయిందని సంబరపడుతూ వెనుదిరిగిన అధికారులు ఆ మర్నాడు అందుకున్న మరో సమాచారంతో షాకయ్యారు. రాతపూర్వక హామీ ఇచ్చిన పెద్దలే.. తమ పిల్లలను వేరొక ప్రాంతానికి తీసుకువెళ్లి, వివాహం చేశారని తెలిసి నిర్ఘాంతపోయారు.
- గడచిన నాలుగేళ్లలో భూపాలపట్నంలో 4, పుణ్యక్షేత్రంలో 6, కొత్తతుంగపాడులో 9, పాతతుంగపాడులో 6 బాల్య వివాహాలు జరిగినట్లు సమాచారం.

చట్టం ఏం చెబుతోందంటే..

బాల్య వివాహాలను అరికట్టేందుకు స్వాతంత్య్రం రాక ముందు నుంచే చట్టాలున్నాయి. మొదటిసారిగా 1929లో చైల్డ్ మ్యారేజ్ రిస్ట్రిక్ట్ యాక్ట్‌ను బ్రిటిష్ వారు తీసుకువచ్చారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తరువాత ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్–2006 రూపొందించారు. దీని ప్రకారం 18 సంవత్సరాలలోపు అమ్మాయిలు, 21 సంవత్సరాలోపు అబ్బాయిలను బాలల కిందే పరిగణిస్తారు. ఈ యాక్ట్ ప్రకారం బాల్య వివాహాలు చేసిన వారి తల్లిదండ్రులతో పాటు ఆ సమయంలో అక్కడున్న వారు, వివాహ తంతు జరిపించే వారు (ప్రోత్సహించినట్టుగా భావిస్తారు) కూడా శిక్షార్హులే అవుతారు. వీరికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష వరకూ జరిమానా విధించవచ్చు. దీనిలో నేరస్తులైతే బెయిల్ కూడా లభించదు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం



సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కొత్తతుంగపాడులో బాల్య వివాహాలు జరుగుతున్నాయి. గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు, గ్రామ కమిటీకి విషయం ముందుగా తెలిసినా కానీ చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. బాల్య వివాహం జరుగుతున్న సమాచారాన్ని పై అధికారులకు సకాలంలో ఇవ్వడం లేదు. బుధవారం రాత్రి జరిగిన బాల్య వివాహం గురించి, తహసీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేశాను.

– యార్లి మాచరయ్య, కొత్తతుంగపాడు

ఫలితమివ్వని గ్రామ కమిటీలు



బాల్య వివాహాలను నిరోధించండి.. అమ్మాయిల జీవితాలను కాపాడండి.. అంటూ ఎంతగా ప్రచారం చేస్తున్నాగానీ, ప్రజల్లో సరైన స్పందన రావడం లేదు. వీటిని ఏవిధంగానైనా అరికట్టాలనే ఉద్దేశంతో గ్రామ మహిళా కార్యదర్శి (పోలీసు), ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓ, అంగన్‌వాడీ కార్యకర్తలతో గ్రామ కమిటీలు కూడా వేశాం. అయినప్పటికీ బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం ముందుగా అందడం లేదు. స్థానికంగా ఉండే మొహమాటాలతో తమ ప్రాంతంలో బాల్య వివాహం జరుగుతోందని తెలిసి కూడా చూసీ చూడనట్లు వదిలేసి, తెలిసీ తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు.

– టి.నాగమణి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం, రాజానగరం

క్లుప్తంగా

ఫైరింగ్ శిక్షణను పరిశీలించిన ఎస్పీ



పెద్దాపురం ఫైరింగ్ మెట్టపై శిక్షణలో భాగంగా గన్ షూటింగ్ చేస్తున్న ఎస్పీ

పెద్దాపురం: పెద్దాపురం మెట్టపై పోలీసు సిబ్బందికి జరుగుతున్న వార్షిక ఫైరింగ్ శిక్షణను శుక్రవారం ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పరిశీలించారు. అత్యాధునిక ఏకే-47, ఇన్సాస్, ఎల్‌ఎంజీ ఎస్‌ఎం-5 తదితర లాంగ్ రేంజ్, షార్ట్ రేంజ్ ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ చేయడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ ఆయుధాల పనితీరు, సామర్థ్యాన్ని ఆయన క్షుణంగా పరిశీలించి రేంజ్ పరిధిలోని సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. ట్రైనీ ఏఎస్పీ సుష్మిత, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ శ్రీహరిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన



సదస్సులో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

రాజోలు: స్వయం ఉపాధి పథకాల ద్వారా దళిత వర్గాలకు ఆర్థిక స్వాలంబన కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. శుక్రవారం శివకోడులోని కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘ కార్యనిర్వాహక సంచాలకులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న ఎస్సీ ప్రణాళికలు, ఇ-ఆటోలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల ద్వారా ఉపాధి కల్పించాలని సూచనలు జారీ చేశారు. కార్పొరేషన్ డైరెక్టర్లు వల్లూరి రాజా, ఎం.చంద్రశేఖర్, కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి పాల్గొన్నారు.

అసలుకు భరోసా.. భవిత కులాసా..

- బాలికలు, మహిళల కోసం పోస్టల్ పథకాలు
- ఆకర్షణీయంగా సుకన్య సమృద్ధి యోజన
- గడువు ముగియనున్న మహిళా సమ్మాన్

రాజమహేంద్రవరం సిటీ: బాలికల, మహిళల ఆర్థిక పురోభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ద్వారా పొదుపు పథకాలను ప్రవేశ పెట్టింది. బాలికలకు సుకన్య సమృద్ధి యోజన, మహిళలకు మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకాన్ని అమలు చేస్తోంది. పొదుపు చేసిన సొమ్ముకు భద్రతతో పాటు ఈ రెండు పథకాలు బాలికలకు, మహిళలకు భరోసానిచ్చే విధంగా ఉన్నాయి. మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మహిళలందరూ ఈ పథకంలో చేరేందుకు అవకాశం కల్పించింది. 2025 మార్చి 31 మాత్రమే అమల్లో ఉండే ఈ స్కీమ్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డ్రైవ్‌లు నిర్వహించేందుకు తపాలా శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ పథకంలో రూ.1,000 నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్‌కు అవకాశం ఉంది.

వన్ టైమ్ సేవింగ్స్ స్కీమ్

మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం వన్ టైమ్ సేవింగ్స్ స్కీమ్‌గా కొనసాగుతుంది. గరిష్ట మొత్తానికి రూ.2లక్షల లోబడి ఎన్ని ఖాతాలైనా తెరిచే అవకాశాన్ని కల్పించింది. ఇప్పటికే ఖాతా ఉంటే కనీసం మూడు నెలల విరామంతో మళ్లీ ఖాతా తెరవవచ్చు. సేవింగ్స్ ఖాతా ప్రారంభించిన తేదీ నుంచి రెండేళ్లు పూర్తయిన తర్వాత మెచ్యూరిటీ కింద డబ్బులు డ్రా చేసుకునే అవకాశం ఉంది. వడ్డీ రేటు మాత్రం ఏడాదికి 7.5 శాతం ఉంటుంది. ఒకరి పేరుతోనే ఖాతా తెరవాలి. జాయింట్ అకౌంట్ సౌకర్యం లేదు. మైనర్ అయితే గార్డియన్ ద్వారా డిపాజిట్ చేసుకునే వీలుంటుంది.



రాజమహేంద్రవరం హెడ్ పోస్టాఫీస్

మహిళా సమ్మాన్ సేవింగ్స్‌లో సొమ్ము పెరిగేది ఇలా (రూ.లలో) ..

డిపాజిట్	2 ఏళ్ల తర్వాత వచ్చే మొత్తం
1,000	1,154
10,000	11,542
50,000	57,714
1,00,000	1,15,428
2,00,000	2,30,854

స్కీమ్‌లో చేరే విధానం

మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ స్కీమ్‌లో చేరే లబ్ధిదారులు ఆధార్, పాన్ కార్డు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని దగ్గరలోని పోస్టాఫీసుకు వెళ్లి ఖాతా ప్రారంభించాల్సి ఉంటుంది. ఈ సేవింగ్స్ సర్టిఫికెట్ కింద డిపాజిట్ చేసిన వారు ఏడాది తర్వాత 40 శాతం డబ్బు ఉపసంహరించుకునే అవకాశముంది. ఒకవేళ డిపాజిట్‌దారులు మృతి చెందితే కారుణ్యం కింద ఖాతా మూసేయవచ్చు. ఎవరైనా మృతి చెందితే తదుపరి నామినీకి ఆ మొత్తాన్ని చెల్లిస్తారు. అవసరాన్ని బట్టి రెండు శాతం తగ్గించుకుని (5.5 శాతం వడ్డీతో)ఆరు నెలల తర్వాత ఎప్పుడైనా ఖాతాను మూసేయవచ్చు.

సుకన్య సమృద్ధి యోజన

ఈ పథకంలో చేరేందుకు 10 సంవత్సరాల లోపు బాలికలు అర్హులు, కనీసం రూ.250 డిపాజిట్‌తో ఆడపిల్ల పుట్టినప్పుడు ఖాతా తెరిచి, ప్రతీ నెలకు కనీసం వంద రూపాయలు పొదుపు చేస్తే, తల్లిదండ్రుల మొత్తం పెట్టుబడి రూ.18,000 (15 సంవత్సరాలకు) పెడితే వారికి మెచ్యూరిటీగా (21 సంవత్సరాల తర్వాత) రూ. 53,945 తపాలాశాఖ అందిస్తుంది.



మహిళా సమ్మాన్ సేవింగ్స్ ఉపయోగాలు తెలిపే చార్ట్

అవగాహన కల్పిస్తున్నాం



రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ పరిధిలో రెండు హెడ్ పోస్టాఫీసులు (రాజమహేంద్రవరం, రామచంద్రపురం) 63 సబ్ పోస్టాఫీసులు, 307 బ్రాంచి పోస్టాఫీసులు ఉన్నాయి. ఈ పోస్టాఫీస్ పరిధిలో ఇప్పటి వరకూ 7000 మంది మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంలో చేరారు. 60,000 మంది సుకన్య సమృద్ధి యోజనలో చేరారు. ఈ రెండు పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సుకన్య సమృద్ధి యోజనను ఆడపిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి

– కే.శేషారావు, సూపరింటెండెంట్

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రైలు నుంచి జారిపడి మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

తుని: తుని–గుల్లిపాడు మధ్యలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి 40 ఏళ్ల వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. తెలుపురంగు కలిగి, 5.5 అడుగులు ఎత్తుతో తెలుపు రంగు బనియన్‌పై నలుపు రంగు చారలు కలిగిన నెక్ బనియన్, నలుపురంగు నైట్ ట్రాక్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

సీతానగరం: మండలంలోని మిర్తిపాడుకు చెందిన తానారి ప్రభాకరరావు (28) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 8.30 గంటలకు మృతి చెందాడని హెడ్‌కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాసరావు తెలిపారు. మృతుడు ప్రభాకరరావుకు వివాహం కాలేదని, అప్పులు ఉండటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రశ్నించడంతో ఈ నెల ఒకటిన ఫ్యాన్‌కు ఉరి వేసుకోగా, గమనించిన కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం చికిత్స పొందుతూ మరణించాడు. తమ్ముడు దుర్గ ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు, ఆసుపత్రి సమాచారంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు

ధాన్యపు కుచ్చులు ఫర్ సేల్!

రామచిలుకలు, పిచ్చుకలు ఇంటి హాల్లో పెట్టిన ధాన్యపు కుచ్చులలో ఉన్న గింజలను తింటూ ఉంటాయి. వీటిని ఎక్కువగా పల్లెల్లో చూస్తాం. ఇప్పుడు ఆ సంప్రదాయం పట్టణాలకు వ్యాప్తి చెందింది. దీనిని దృష్టిలో ఉంచుకుని రాజానగరం మండలం సంపత్‌నగరం గ్రామానికి చెందిన రైతు యాళ్ల రుద్రం ధాన్యపు కుచ్చులను ప్రత్యేకంగా అల్లి బొమ్మూరు జంక్షన్‌లో 20 రోజులుగా విక్రయిస్తున్నారు. కుచ్చు సైజును బట్టి రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నాడు. ఈ ధాన్యపు కుచ్చులను చూసినవారు ఆసక్తిగా తిలకించడంతో పాటు కొనుగోలు చేసుకుని వెళుతున్నారు.

– రాజమహేంద్రవరం రూరల్



బొమ్మూరు జంక్షన్‌లో ధాన్యపు కుచ్చులను విక్రయిస్తున్న రైతు రుద్రం

ఎయిర్‌పోర్టుకు భూములివ్వలేం

- ఇప్పటికే పోలవరం, పుష్కర, రహదారులకు పొలాలను కోల్పోయాం
- పి.ఇ.చిన్నాయపాలెం రెవెన్యూ సదస్సుల్లో ఏబీసీ రైతు సంక్షేమ సంఘం నాయకులు



తొండంగి మండలం పి.ఇ.చిన్నాయపాలెం రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ మురార్జీకి వినతిపత్రం ఇచ్చిన ఏబీసీ రైతుల సంక్షేమ సంఘం నాయకులు, రైతులు

తొండంగి: పోలవరం కాలువ, పుష్కర పథకం, జాతీయ రహదారులకు ఇప్పటికే భూములిచ్చిన తాము ఉన్న కాస్త పొలాలను ఎయిర్‌పోర్టుకు ఇచ్చి నష్టపోలేమని అన్నవరం, పి.ఈ.చిన్నాయపాలెం, బెండపూడి(ఏబీసీ) గ్రామాల రైతుల సంక్షేమ సంఘం నాయకులు రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని పి.ఇ.చిన్నాయపాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రభుత్వం ప్రతిపాదించిన విమానాశ్రయానికి భూములిచ్చేది లేదని మూడు గ్రామాల రైతులు ముక్త కంఠంతో స్పష్టం చేస్తూ మరోమారు తహసీల్దార్ మురార్జీకి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే పోలవరం కాలువ, పుష్కర కాలువ, జాతీయ రహదారులకు దాదాపు 600 ఎకరాల వరకూ భూములిచ్చామని వివరించారు. మూడు గ్రామాలకు సంబంధించి 1200 మంది చిన్న,సన్న కారు రైతులతోపాటు పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడిన వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారన్నారు. రెండు పంటలు పండే పచ్చని పంట పొలాలను ఇస్తే వ్యవసాయంపై ఆధారపడిన రైతులు, కూలీలు కుటుంబాలు జీవనాధారం కోల్పోతాయన్నారు.

పెనుగుదురు, గురజనాపల్లి గ్రామాల మధ్య దాదాపుగా 3,000 ఎకరాలు ప్రభుత్వానికి చెందిన భూములున్నాయని, కాకినాడ సెజ్‌లో పదివేల ఎకరాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆ ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదన చేయాలని కోరారు. పచ్చని పొలాల్లో ప్రస్తుతం ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు తీర ప్రాంతంలో పారిశ్రామిక అవసరాల కోసం ఉద్దేశించిన కార్గో ఎయిర్‌పోర్టు మాత్రమేనని అన్నారు. దీనివల్ల రైతులతోపాటు ప్రముఖ్య పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులకు, ధ్వని, వాయుకాలుష్యం కారణంగా వైదిక కార్యక్రమాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని వివరించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఎయిర్‌పోర్టుకు భూమిలివ్వబోమని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టును మరోచోటి తరలించే వరకూ ఉద్యమిస్తామని తెలిపారు. రైతులు ఇచ్చిన వినతిపత్రాలను ప్రభుత్వ ఉన్నతాధికారులకు పంపుతామని తహసీల్దార్ మురార్జీ తెలిపారు. కార్యక్రమంలో ఏబీసీ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాలచెర్ల భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి రాయవరపు ఆనందరావు, రైతులు నరహరిశెట్టి సూర్యప్రకాష్, వడ్డి రాంబాబు, తంగెళ్ల శ్రీను, వడ్డి సుబ్రహ్మణ్యం, జీవీఎస్ శాస్త్రి, దాసరి సత్యనారాయణ పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్ పోటీలు ప్రారంభం



ఎస్.యానం బీచ్ వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలో ఉన్న సముద్ర తీర ప్రాంతంలో జాతీయ స్థాయి బీచ్ వుమెన్ వాలీబాల్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో గోవా, పాండిచ్చేరి, గుజరాత్, తమిళనాడు, కేరళ, ఒడిశా, వెస్ట్ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటనున్నాయి. తొలి రోజు జరిగిన మ్యాచ్‌లలో గోవా–ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడగా ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించింది. రెండవ మ్యాచ్‌లో చెన్నై- వెస్ట్‌బెంగాల్ జట్లు తలపడగా చెన్నై విజయం సాధించింది. మూడవ మ్యాచ్‌లో పాండిచ్చేరి–కేరళ జట్లు తలపడ్డాయి. రాత్రి వరకు సముద్ర తీరంలో కొనసాగిన బీచ్ వాలీబాల్ పోటీలు చూడటానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ పోటీలు మరో రెండు రోజుల పాటు జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పోలీసులకు పట్టుబడిన ఏడుగురికి న్యాయమూర్తి శుక్రవారం రూ.70 వేలు జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు. స్థానిక సీఐ బి సూర్య అప్పారావు కథనం మేరకు ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి, వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఏడుగురిని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి కాటం భాను ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున రూ.60,000 జరిమానా విధించారు. ఒకరికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించారు. రౌతులపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఒకరిని తుని కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రూ.10,000 జరిమానా విధించినట్టు సీఐ సూర్య అప్పారావు తెలిపారు.

ఇళ్లు పోతున్నాయన్న బెంగతో వ్యక్తి మృతి



సుందరయ్య

మలికిపురం: మండల పరిధిలోని మేడిచర్లపాలెంకు చెందిన చింతా సుందరయ్య (55) తమకు చెందిన ఇళ్లు పోతున్నాయన్న బెంగతో శుక్రవారం మృతిచెందారు. గ్రామ శివారు పెద్దకాల్వ గట్టు చర్చి వద్ద వీరు స్థిర నివాసం ఉంటున్నారు. రెండు నెలల క్రితం చేపట్టిన రైల్వే ఎలైన్‌మెంట్‌లో తన ఇంటితో పాటు, కుమారుల ఇళ్లు కూడా పోతున్నాయని ఆయన బెంగ పెట్టుకున్నారు. అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదన్న మనో వ్యధతో బాధ పడిన ఆయనకు వైద్యం చేయించినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

భర్తతో వివాదం...పిల్లలతో ఆత్మహత్యకు యత్నం

దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపిన రైల్వే పోలీసులు



భార్యాభర్తలు లోవలక్ష్మి, శ్రీనుతో రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యాం త్రినాథరావు

అన్నవరం: భర్తతో వివాదం కారణంగా ఇద్దరు ఆడపిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన మహిళకు రైల్వే పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కాపాడారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం నామవరానికి చెందిన కిల్లాడ లోవలక్ష్మికి ఇద్దరు పిల్లలు. భర్త శ్రీనుతో గొడవ పడి వేరుగా ఉంటోంది. ఆమె శుక్రవారం ఆత్మహత్య చేసుకుందామని పాయకరావుపేటలో ఉన్న భర్తకు పిల్లలను అప్పగించేందుకు వెళ్లింది. పిల్లలను తీసుకునేందుకు భర్త నిరాకరించాడు. దీంతో పిల్లలతో అన్నవరం రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండడంతో రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యాం త్రినాథరావుకు అనుమానం వచ్చి ప్రశ్నించారు. ఆమె కుటుంబ తగాదాల గురించి చెప్పింది. ఆయన రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావుకు విషయం చెప్పారు. ఆమె భర్త శ్రీనును రైల్వేస్టేషన్‌కు రప్పించి భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

పిఠాపురంలో ఫ్లెక్సీల రగడ



పిఠాపురంలో ఆందోళన చేస్తున్న జనసేన నాయకులతో చర్చిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: పిఠాపురంలో కూటమి పార్టీల మధ్య ఫ్లెక్సీల రగడ మొదలైంది. పిఠాపురం పట్టణంలో పలుచోట్ల ఉన్న జనసేన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. టీడీపీకి చెందిన ఫ్లెక్సీలను ఉంచి జనసేన ఫ్లెక్సీలను తొలగించడమేమిటంటూ జనసేన పార్టీ నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మెయిన్ రోడ్డులో బైఠాయించి ఆందోళన నిర్వహించారు. జనసేన నాయకులకు మున్సిపల్ అధికారులు సమాచారం ఇవ్వకుండా తొలగించడమేమిటంటూ ఆందోళన చేశారు. ఆందోళన చేస్తున్న జనసేన నాయకులతో పోలీసులు చర్చించడంతో ఆందోళన విరమించారు.

మండపంలో పోలీస్ పహారా



మండపంలో పహారా కాస్తున్న పోలీసులు

శంఖవరం: మండలంలోని మండపం గ్రామంలో వైఎస్సార్ సీపీ నేతలపై కూటమి నేతల దాడి నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు కాపలా కాస్తున్నారు. దాడుల కారణంగా గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. కూటమి నేతల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ నేతలకు అండగా ఉంటానని ఎవ్వరూ అధైర్యపడవద్దని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరి అన్నారు. దాడికి పాల్పడిన టీడీపీ నేతలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీపీ పర్వత రాజుబాబు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

సందడికి వేళాయె

- జేఎన్‌టీయూకేలో నేటి నుంచి క్రియ పిల్లల పండగ
- రెండు రోజుల పాటు నిర్వహణ
- వివిధ ప్రాంతాల నుంచి 8,500 మంది విద్యార్థుల రిజిస్ట్రేషన్
- లఘు నాటికలు... 29 అంశాలపై పోటీలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పిల్లల పండగ పేరుతో క్రియ స్వచ్ఛంద సంస్థ ప్రతి ఏడాది రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమానికి జేఎన్‌టీయూ కాకినాడ వేదిక కానుంది. జిల్లాతో పాటు రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమలో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం రావడంతో వివిధ ప్రాంతాల నుంచి 8,500 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. క్రియ స్వచ్ఛంద సంస్థ ప్రారంభించిన నాటి నుంచి మధ్యలో రెండేళ్లు కరోనా కారణంగా నిలిపివేసినా ఇప్పటి వరకూ పదిసార్లు ఈ కార్యక్రమం నిర్వహించారు. శనివారం నుంచి రెండు రోజులపాటు 11వ రాష్ట్ర అంతర్ పాఠశాలల సాంస్కృతిక పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలిరోజు నాటికలు, శాస్త్రీయ నృత్యం, ఏకపాత్రాభినయం, కోలాటం, పాటల గ్రూపు, పోస్టర్ ప్రజంటేషన్, సైన్స్ ప్రయోగాలు, డిబేట్, గణితం, క్విజ్, వ్యాస రచన, కథారచన, కథా విశ్లేషణ, అంతర్జాలంలో అన్వేషణ పోటీలు నిర్వహించనున్నారు. రెండవ రోజు ఆదివారం జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, బుర్ర కథ, కోలాటం, ప్రాజెక్టు పని, వాద్య సంగీతం, పాటలు, కథ చెప్పడం, స్పెల్లింగ్, చిత్రలేఖనం, సృజనాత్మకత వస్తువుల తయారీ, మట్టితో బొమ్మలు తయారీ, మైమ్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమ నిర్వహణకు కమిటీ సభ్యులను నియమించి ఒక్కొక్క విభాగానికి టీమ్‌లను నియమించారు. వర్సిటీ ప్రవేశ ద్వారంలో రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేసి పేర్లు నమోదు చేయనున్నారు. వర్సిటీ ఆడిటోరియం, బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయం, మెకానికల్ పీజీ బ్లాక్, డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఎడమ పక్కన, సీఎస్ విభాగం, ఈఈఈ బ్లాక్ వద్ద పోటీల ప్రదర్శనకు వేదిక ఏర్పాటు చేయగా వీసీ పరిపాలన భవనం వెనుక భోజన వసతి కల్పించనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు సందర్శనకు వచ్చే వారి వాహనాలు వర్సిటీకి ఎదురుగా ఉన్న ఐటీఐ కళాశాల ప్రాంగణంలో పార్కింగ్ చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ, లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, హాజరవుతున్నారు. రెండు రోజుల కార్యక్రమం అనంతరం ఆదివారం సాయంత్రం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు.



గత ఏడాది క్రియ పిల్లల పండగకు విచిత్ర వేషధారణలో వస్తున్న చిన్నారి